# ఓ రాకాసి కథ

అవాళ్టికి ప్రసాదు చనిపోయి పదకొండు. ఆ రోజే పెద్ద కార్యం. వచ్చిన బంధు జనం తోటి ఊరి జనం తోటి ఇల్లు కిటకిట లాడుతోంది. వీధి వీధంతా అలికిడిగా ఉంది. ఇంటి ముందు వేసిన షామియానాలు, వీధిలో నాలుగిళ్ళ దాకా పరచుకుని ఆ చివర వచ్చిపోయే వాహనాలని ఆపేసాయి. షామియానాల కింద భోజనాలకని బెంచీలు, కుర్చీలు సర్దుతున్నారు కొంతమంది కుర్రవాళ్ళు.

సూర్యుడు నెత్తిమీద కొచ్చేసరికి వచ్చీ పోయే జనం పెరిగారు. ఎండాకాలం కావడం చేత ఎంత గాలాడుతున్నా షామియానాలు నీడనిస్తున్నా కాచిన ఎండ వేడిమికి అంతా చెమటలు పట్టి ఉన్నారు. ఇంటిపక్క పునాదులు తవ్వి వదిలేసిన ఖాళీ స్థలంలో పెద్ద పెద్ద గ్యాస్టవుల మీద వంటలు తయారవుతున్నాయి. వాటి వేడిగాలి షామియానాల మీదుగా వచ్చి అందరి ముఖాల మీద వడగాల్పులా తాకుతోంది.

స్టీరియో మైకుల్లో పెద్ద శబ్దంతో సినిమా పాటలేవో వినవస్తున్నాయి. వేటితో సంబంధం లేకుండా పనులు చకచకా సాగుతున్నట్లు కొందరు హడావిడిగా కేకలు వేస్తూ అటూ ఇటూ తిరుగుతున్నారు.

ఆ ఇంట్లో సరిగ్గా అయిదేళ్ళ క్రితం ఇదే మాదిరిగా కార్యం జరిగింది. అప్పుడు ప్రసాదు పెళ్ళి కార్యం! ఇప్పుడు చావు కార్యం! ఈ కార్యానికి హాజరైన చాలామందికి ప్రసాదంటే తెలీకపోయినా అతని కథ అందరికీ తెలుసు. తెలిసినందువల్ల ఆ కథకి ముగింపు లేనట్టు ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడుతున్నారు.

బెంచీపై విస్తళ్ళు వేశారు. మైకులో వస్తున్న పాటలు ఆగిపోయాయి. పాటలు ఆగిపోవడం వల్ల మనుషుల రొద పెరిగినట్టనిపించింది. నిజానికి ఏ ఇద్దరు ముగ్గురు గుమికూడినా మాటలే.

కుశలాలే... అంతకన్నా ప్రసాదు కబుర్లే. తింటూనే ఆగి మరీ మాట్లాడుకుంటున్నారు. వడ్డించే వాళ్ళు వాళ్ళు వాళ్ళేనని ఆగినట్టు లేరు. పైగా ప్రసాదు మీద జాలిపడడం, అతని ముసలి తల్లి మీద.. అంతకన్నా చిన్న పిల్లలిద్దరి మీద జాలిచూపడం - విచారించడం - నొచ్చుకోవడం ద్వారా తమకున్న గొప్ప మనసును వెల్లడి చేసుకుంటున్నారు.

అందరి అన్ని మాటలు పోయి పోయి 'మృత్యువు'ని చేరుకున్నాయి. ఎవరెవరికి చావు ఏయే రూపాల్లో ముంచుకొచ్చిందీ చెప్పుకుంటున్నారు. మూడు లోకాలు కాదు, ఏడేడు లోకాల్లో ఎక్కడ దాక్కున్నా మృత్యువుని తప్పించుకోలేరని చెప్పి సాక్ష్యాలుగా పురాణ కథలన్నీ తలచుకున్నారు.

'మా ప్రసాదుకి పెళ్ళే మృత్యువును తెచ్చి పెట్టింది. మృత్యువు ఎన్నెన్ని రూపాల్లోనో వస్తుంది గానీ.. మా వాడికి మాత్రం పెళ్ళాం రూపంలో వచ్చి బలితీసుకుంది'. ప్రసాద్‌కి పెదనాయన వరసైన పెద్దాయన తనకి తనే చెప్పుకున్నట్లు నలుగురి ముందూ అన్నాడు. 'ఎక్కడ వుంచాల్సిన వాళ్ళని అక్కడే వుంచాలి. లేదని కాదని నెత్తికెక్కించుకుంటే నెత్తిమీద తన్నీడమే కాదు నేల్లో పాతేస్తారు. ఈ ఆడోళ్ళు' ఎవరో నడివయసాయన తింటూనే అందరి వంక చూసి మరీ అన్నాడు.

ఆ బంతిలో ఒక వారగా ఉన్న ఆడవాళ్ళు ఆయన చూపుకో... ప్రసాదు భార్య చేసిన తప్పిదానికో తెలీదు గాని నేరాన్ని అంగీకరిస్తున్నట్లు తలలు దించుకున్నారు. చేస్తున్న భోజనాన్ని ఆపి కలిపిందే కలుపుతున్నారు. ఏమయినా వాళ్ళలో వాళ్ళు గొణుగులాడుతున్నారు. 'అలాటాడదాయి ఒక్కదాయి వుంతే సరి... ఆడ జల్మకే అగ్గెట్టేసి ఆరుమూడు గాలాలకి బూమ్మీద పేరు నిలబెట్టేదాకి' ఒక మాసలామె గొణుగుడు గొణుగుడు. ఆ మాటలు అక్కడున్న మగవాళ్ళకే కాదు. ఆ ఇంటికి ... ఇంటి మీద వున్న ఒంటి గదిలోకి వినిపిస్తున్నాయి. ఈ పదిరోజులూ వేరు, ఆ పదకొండో రోజున మరీ ఎక్కువయ్యాయి. అందరూ కార్యం సందర్భంగా ఒక్క చోట కలవడం అందుకు అవకాశాన్నిచ్చినట్టువుంది. అంచేత ఎక్కడో భోజనాల దగ్గరే కాదు... ఇంట్లోనూ .. వంటల దగ్గరా... మెట్ల దగ్గరా. చివరికీ 'ఈవిడేనా ఆ రాకాసి?' అని చూసే చూపుల దాక కూడా!

రేణుక ముఖం ఇన్నాళ్ళలా రేకులు విచ్చుకున్న పువ్వులా లేదు. వాడిపోయి కాంతి విహీనంగా వుంది. కళ్ళలో నీటి చుక్కలేదు. కళ్ళ కింద నల్లటి మరకలేవో మసిపోయినట్లున్నాయి. తెల్లచీరలో బొట్టూ కాటుక లేక తాడు తెగిన మెడా - పొద్దుటికుండి ఇప్పటికి లేకపోయినందువల్లనేమో బోసిగా వున్నాయి. ఆమె తలదించుకునే వుంది. ఆమె ముందున్న కంచంలో పాలు... మరో పక్క కంచంలో చిల్లర నాణేలూ.. ఇవన్నీ చూస్తున్నట్టే - చూసి నవ్వుతున్నట్టే వున్నాడు ప్రసాదు. ఆమె పువ్వులు తీసి తను దండగా వేసుకున్నాడు. ఆమె కుంకుమ తీసి తన నుదిటన దిద్దుకున్నాడు. ఆమె కళ్ళలోని వెలుగుని తీసి తన ముందు నూనె దీపంగా పెట్టుకున్నాడు. పెట్టుకొని దేవుడి ఫోటోల పక్కన ఫోటో అయి నిల్చున్నాడు. దేవుడై నిల్చున్నాడు. చాలక నవ్వుతున్నాడు.

రేణుక అలా చూస్తూనే వుంది. కళ్ళు పీకుతున్నాయి. మనసు మరింత పీకుతోంది. ఇదంతా నిజం కాదన్నట్టు నమ్మలేనట్టుగానే వుందామెకి. అప్పుడప్పుడూ పడ్డ భ్రమలాగే వుంది. ఫోటోలోని ప్రసాదు తన చూపుల వెంట ఆమెని తీసుకెళ్ళ బోయాడు. కాని ఆమె వెళ్ళలేక పోయింది. అందరూ ముఖం చూడ్డం వల్ల తనక్కడే అలాగే కూర్చుంది. అయిదేళ్ళ క్రితం ఆరాటంగా కొత్త

కథా నిలయం
3436

పెళ్ళి కూతురుగా వున్న తనని చూడ్డం కోసం వచ్చినట్లు, ఇవాళ అంత మందీ వచ్చి 'ముఖం' చూస్తున్నారు. రేణుక అవాళ పెళ్ళిలో తల ఎత్తి మాట కాసింది. ఇవాళ ఆమె తల దించి కూడా మాట కాస్తోంది.

చినుకులు పడుతున్నట్టు ఆమె ముందు చిల్లర నాణేలు పడుతున్నాయి. కొన్ని చిల్లర గల కంచంతో పాటు, పాల కంచంలో పడుతున్నాయి. ముత్తైదువ లొచ్చి ఆ కంచంలోని పాలని చేత్తో తీసి రేణుక రెండు చెంపలకీ గంధం పూసినట్లు పూస్తున్నారు.

చిన్నా పెద్దా అంతా చేతులెత్తి ప్రసాదు ఫోటోకు నమస్కరిస్తున్నారు. ఆయన చిత్ర పటాన్ని గోడ ఆనుకుని అతుక్కుపోడానికి కూర్చున్నట్లు కూర్చుంది రేణుక. వచ్చి పోయే జనం వల్ల తను రోడ్డు మీద బొమ్మ పక్క వున్నట్లే వుంది.

ఆమెకు ఇరువక్కల నాలుగేళ్ళ కూతురూ, రెండేళ్ళ కొడుకూ కూర్చొని వున్నారు. ఆ పసి వాళ్ళిద్దరూ చేతులు జోడించి నమస్కరిస్తూ తల్లి వంకా తండ్రి ఫోటో వంకా వచ్చిపోయే జనం వంకా పడుతున్న చిల్లర వంకా చూస్తున్నారు. నేల మీద పడ్డ నాణేల్ని తీసి చిల్లర గల కంచంలో వేస్తున్నారు

రేణుక అత్తగారు రూపకత్తె పెద్దదిక్కులాగ అక్కడే కూర్చుని వచ్చీ పోయే వాళ్ళని 'రండమ్మా' అని ఆహ్వానిస్తున్నది. మధ్య మధ్యలో 'ఇవాళ మొఖం చూపిస్తే ఇంకెప్పుడూ మొఖం చూసినా తప్పులేదు. తప్పు మరుండదు' శాస్త్రం విప్పుతూ చెబుతోంది. ఊర్లో వున్న బంధువులొస్తే 'సాయంత్రం చీకటి పడిన తర్వాత ఇల్లు మట్టించుదురు... తీసుకెళ్దురు.. చెపుతోంది.

పొద్దునాల నుంచి ముఖం చూడ్డానికి వచ్చిన మనుషులు మధ్యాహ్నం రెండు గంటలు దాటేసరికి కొద్దిగా పల్చబడ్డారు.

ఆకలికి తాళలేకనో రేణుక రెండేళ్ళ కొడుకు తండ్రి ఫోటో ముందు పెట్టిన అరటి పండు తీసి ముక్క కొరకాడో లేదో ... 'తప్పురా' అంటూ అరిచింది పక్కనే వున్నావిడ. 'నాన్నకి పెట్టిందిరా' అని చెప్పబోయింది.

ప్రసాద్ తల్లి కమలమ్మ వచ్చి అది చూసి 'పిల్లలకేటి తెలుస్తాది. పెద్దోలకి మనకే బుద్ధి లేదు. బుద్ధుంటే బంగారం లాంటి కొడుకు బుగ్గిసేసుకుంతామా? ఇకన ఈ పిల్లల ఆకలెవురు సూస్తారు... ఆలనెవులు సూస్తారు?' అంటూ ఆ పిల్లాణ్ణి ఎత్తుకుంది. వాడితలని తన నెత్తికేసి కొట్టుకుంటూ తిరిగి ప్రసాద్ ఫోటోకి తన తలనీ మనవడి తలనీ కొట్టుకుంటూ "వదిలెలా పోనావురయ్యా.. ఈ రాకాసుల బాధ పడలేక ఎలిపోనావా.. ఈ కండల్ని ఎవులి గుండెల మీద ఒగ్గీసెలిపోడాకి... నీకు గుండెలాగొచ్చిందిరా కొడకా..." ఏడుస్తూనే వుంది. ఒక చేత్తో పిల్లాడ్ని పట్టుకొని మరో చేత్తో కడుపు బాదుకుంటోంది. అక్కడ చేరిన వాళ్ళంతా ఆమెను ఆపే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రసాదు తమ్ముళ్ళిద్దరూ తల్లిని బలవంతంగా తీసుకెళ్ళారు. వెళ్తూ ఆమె ఈంద్రబడుతోంది. ఆ భగవంతుడు తన్నెందుకు తీసుకెలి పోలేదని తిడుతోంది. కడుపుకోత పెట్టడం తగదని దేవుణ్ణి ఆరోపిస్తోంది. మళ్ళీ వెనక్కి వచ్చి ఆ పిల్లాడి అక్కనీ తీసుకెళ్ళింది.

ఆ పిల్లలిద్దరూ ఏడుపందుకున్నారు. వదిలితే పరిగెత్తుకు వచ్చి మళ్లీ తల్లి చెంకన చేరారు. కమలమ్మ కళ్ళు తుడుచుకుంటూ వెంటే వచ్చింది. పిల్లలిద్దర్నీ తల్లిచంకనుండి బలంగా లాగింది. రేణుక చేష్టలుడిగినట్టు కూర్చుందే గానీ అత్తని ఆపే ప్రయత్నం చేయలేదు. కాని ఆ పిల్లలిద్దరూ తల్లి కొంగు పట్టుకు వదల్లేదు. 'వదినా నేను తెస్తాను పదా' ఈరకత్తె మాట కమలమ్మను ఆపలేక పోయింది.

"సేన లేయ్రా... అందరమ్మల్లాంటి అమ్మయితే ఇంకొప్పకపోదురు..." అంటూనే అరుస్తూనే పిల్లలిద్దర్నీ రెండు చేతుల్తో ఇటొకర్ని అటొకర్ని పట్టుకొని బరబరా ఈడ్చుకుపోతోంది కమలమ్మ.

రేణుక కూర్చున్న చోటు నుంచి లేవలేదు. కమలమ్మ మాటలు వినే శక్తీ, ఆసక్తి లేకపోయినా పిల్లల వెంట పడాలనీ అనిపించలేదు. తన ప్రమేయం లేకుండా అన్నీ జరిగిపోతున్నట్టుగా వుంది.

"మీకు నాన్న లేకండా సేసిందిరా మీయమ్మ... మిమ్మల్నీ లేకండా నాకు దక్కకండా సేస్తే తట్టుకోలేను. వద్దురా... రాయ్రా... ఒక్క రవ్వ బువ్వ తినీయండి... పద్దకొండు రోజులుగా ఎంత ఆకలితో వున్నాడో నా అయ్య... మీ నాన్న ఒక్క ముద్ద తినడానికి ఇంటికి రాలేదు. కొడుకో" ... కమలమ్మ దుఃఖం, శోకం రేణుకకు వినిపిస్తూనే వుంది. పిల్లల ఏడుపూ రొద కూడా...

రేణుక ఒక్కర్తీ ఆ ఒంటి గదిలో మిగిలింది. అందరూ పిల్లల ఏడుపుతో కింద ఇంట్లోకి వెళ్ళిపోయారు.

రేణుక కన్నార్పకుండా ప్రసాదు ఫోటోనే చూస్తోంది. ప్రసాదు ఆపకుండా నవ్వుతున్నాడు. చూస్తుండగానే ప్రసాద్ మాయమయ్యాడు. రేణుక కళ్ళలో నీటి తెరలు. బొట్లు బొట్లుగా రాలాయి. రాలిన బొట్లు పాలల్లో కలిసేయి. పాలు విరిగిపోలేదు. తెల్లగా, స్వచ్ఛంగా వున్నాయి. కనిపిస్తున్నాయి.

★ ★ ★

"ఏమిటే రేణుకా ఆ చెమట్లు...? ఎవరు వెంటపడ్డారేమిటీ...?' పద్మ పలకరింపుగా నవ్వి చేయి అందుకోబోయింది.

'ఎవరు? వాళ్ళాయనే వెంటపడి వుంటాడు'...? సుజాత నవ్వుతూ రేణుకకు దగ్గరగా వెళ్ళబోయింది.

'కాదు.. కాదు సంసార సాగరంలోంచి ఈత కొట్టుకుంటూ మన ఒడ్డుకు వచ్చింది. ఊపిరి తీసుకోనివ్వండి....' లక్ష్మి నవ్వకుండానే అని రేణుకకు అరుగు మీద కుర్చీ చూపించింది. రేణుక ఆగకుండా దాటుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది. అందరూ ఆశ్చర్యంగా ఆమెను అనుసరించారు. రేణుక బెడ్ రూమ్‌లోకి వెళ్ళి మంచం మీద కూర్చుని గోడకు చేరగిల బడింది. అలసటకు నోటితో గాలి పీలుస్తూ కళ్ళు మూసుకుంది. తనముందే నిలబడినా స్నేహితురాళ్ళని పట్టించుకోలేదు.

'ఎవరదీ రేణుకా?!'. మాటలన్నీ విని వంటగదిలోంచి బయటకు వచ్చి చూసి వెతుకుతూ బెడ్‌రూమ్‌లోకి వచ్చింది పద్మవాళ్ళమ్మ. ఆవిడ గమనించిందేమో 'ఆగండ్రా ... మీరు ముగ్గురూ ఒకటైపోయి వేళాకోళమాడితే ఎలాగ? రేపు మీకు పెళ్ళిళ్లవుతాయి. పిల్లలవుతారు... పెనిమిటి

వుంటాడు. పెర్మిషనుంటాది. మీరప్పుడు ఒకళ్ళకొకలు ఎంతొచ్చేస్తారో చూద్దాం. మొత్తానికి రేణుక చాన్నాళ్ళకొచ్చింది. అదీ మా పద్మ పెళ్ళి కుదరడం వల్ల వచ్చింది' అంటూ మంచం మీది గుడ్డలు దులిపి సర్దుకొంటోంది. అంతలో గుర్తుకు వచ్చినట్లు లోపలి గదిలోకి వెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి - రేణుక ముందు టీపాయి మీదుంచింది. 'పిల్లల్ని తీసుకురాలేదేమ్మా' అని కూడా అడిగిందామె.

రేణుక కళ్ళు తెరిచింది. ఆమె కళ్ళని చూశాక ఏదో తెలీని భావన కలిగి, ఎవ్వరూ మాట్లాడలేదు. పద్మా వాళ్ళమ్మ కూడా రేణుక ముఖం చూసి జవాబు రాకపోయినా ఆగిపోయింది.

కొద్దిసేపు ఆగి పద్మ మాత్రం అంది. 'నేనివ్వాల్సిన ఫీలింగు నువ్విచ్చేస్తున్నావు. పన్నెండేళ్ళు కలిసి చదువుకోవడమే కాదు. ఇన్నేళ్ళ ఫ్రెండ్‌షిప్‌ని పెళ్ళవగానే మర్చిపోయావు. ఈ అయిదేళ్ళలో ఒక్కసారన్నా మా ఇంటికొచ్చావా? పై వూళ్ళో ఎక్కడో వుంటే జీవితకాలంలోనయినా ఖచ్చితంగా కలవలేకపోయే వాళ్ళం. వున్న వూళ్ళో వుండి కూడా...''

పద్మ మాటలు పూర్తికాలేదు. రేణుక రెండు ముడుకుల మధ్య ఇంకా తన ముఖం కనుపించకూడదన్నట్టు... రెండు చేతుల్తోనూ కప్పుకుంది. ఆమె ఎంతగానో బిగియపట్టిన దుఃఖం.. దాచుకోవడం వశం కావడం లేదు. బుసబుసమన్న చప్పుడు ఆమె ప్రయత్నాన్ని విఫలం చేస్తోంది. పెదవి దాటకుండా చెంగు అడ్డం పెట్టి పసిపిల్లలా ఏడుస్తోంది.

అంతా ఆశ్చర్యపోయారు, ఆపబోయారు. పక్కనే కూర్చున్నారు. కంట్రోలు కమ్మన్నారు. తల నిమిరారు.

''రేణూ ఏమయ్యిందే?!'' ముగ్గురు స్నేహితురాళ్లదీ ఒకే గొంతు...

''అవతలి మనిషిని మాట్లాడనివ్వకుండా ... నువ్వెందుకు అన్నిమాటలు అన్నావ్.. పద్మా ముందూ వెనుకూ చూసుకో అక్కర్లా?... ఏం పిల్లవో?'' పద్మని ఆమె తల్లి కోపగించుకుంది. రేణుకని 'ఊరుకోమ్మా' అని సముదాయించబోయింది.

''సారీ ఐయామ్ వెరీ సారీ రా రేణూ..'' పద్మకి తను చేయకూడని తప్పు చేసినట్టు, మాట్లాడినట్లు తోచి రేణుక చేతులు పట్టుకొంది. సుజాత, లక్ష్మి కూడా తప్పులో తామూ భాగం పంచుకున్నట్టు భావించి మౌనమై పోయారు. కొయ్యబారి పోయారు. తేరుకుని వారించ బోయారు. మీరు కాదు అన్నట్టుగా తల ఊపింది గానీ రేణుక దుఃఖం తీరలేదు. ఏడుపు, వెక్కిళ్ళూ ఆగలేదు. ఏం చెయ్యాలో తోచక, దుఃఖంఏడుపు రూపంలో కన్నీళ్ళరూపంలో కొట్టుకుపోతే మనసు తేలికై మనిషి కాగలుగుతుందని ఆమెని అలాగే వదిలి వేరే గదిలోకి వెళ్ళారంతా.

గదినిండా నిశ్శబ్దం అలుముకుంది. ఎంచేతనో వేరే గదిలోకి వచ్చినా లక్ష్మి, పద్మ, సుజాత ఏమీ మాట్లాడుకోలేకపోయారు. వారి కళ్ళలోనే ఒక అంగీకారం కుదిరి నిశ్శబ్దాన్ని పాటించారు.

పద్మ వాళ్ళమ్మ వంట గదిలో చేరి సామానులు సర్దుకుంటోంది. రేణుక వున్న గదిలో గడియారం ముళ్ళు టక్..టక్ మంటూ వుంది. విన్న కొద్దీ 'టక్.. టక్' మన్న శబ్దం టంగ్ టంగ్

మంటూ బడి బెల్లులా వినపడ్డం మొదలు పెట్టింది. రేణుక తల ఎత్తి గోడన వున్న గడియారం చూసింది.

పాప కాన్వెంటు నుండి ఇంటికి వచ్చుంటుంది. 'అమ్మేది'? అని అడిగి వుంటుంది అనుకుంది రేణుక. అప్పుడు ఆమె దుఃఖం తొలగిపోయింది. పైటచెంగుతో ముఖమూ, కళ్ళూ తుడుచుకుంది. లేచి ఇంటికి తిరిగి వెళ్ళి పోవాలనుకుంది. లోలోపల వెళ్ళకూడదనీ అనిపించింది. ఏదో నిస్సత్తువ.. వెళ్తే మరింతగా నీరసమనో.. లేవకుండా కూర్చున్న చోటునే వుండిపోయింది.

అవతలి గదిలోంచి మాటలు నెమ్మదిగా మొదలయ్యాయి.

"ఆంటీ.. పద్మని ఈ సెలవుల్లో మా వూరు పంపాలి. సుజాత వస్తోంది. మీరా, అనూ కూడా వస్తామన్నారు.. నిన్న కేంపస్‌లో అంతా ఓకే అన్నారు..." లక్ష్మి అడుగుతోంది.

"ఇంతకాలం దానిష్టమొచ్చినట్టు అది తిరిగింది. మీ యిష్టమొచ్చినట్టు మీరూ తీసుకెళ్ళారు. ఇప్పుడలాగ కాదు కదా.." పద్మ తల్లి అంది.

"అంటే ... ఆంటీ.." అంతకుమించి మాట రానట్టుంది లక్ష్మికి. తిరిగి పద్మ వాళ్ళమ్మే అంటోంది. 'సంబంధం' అనుకున్నాం. అదీ అయిపోయింది. నిన్న లేదు మొన్నే వచ్చి బొట్టుపెట్టి వాళ్ళ పిల్లనిపించుకున్నారు. ఇలాంటపుడు ఎటు పంపినా బాగోదు. సంబంధమయి పోయినా ఆడపిల్ల అలా తిరుగుతుందేమిటి అంటారు. అది అవతల ఆలకీ బాగోదు. మనకీ మంచిది కాదు'.

"పద్మ వుడ్‌బీని మేం పర్మిషన్ అడుగుతాం..." సుజాత పట్టుపడుతోంది.

"ఆ అబ్బాయి అవునంటే సరి, మరి అడ్డేమి లేదు..." పద్మ మీద తమకిక ఏ అధికారమూ లేనట్టే అంటోంది వాళ్ళమ్మ.

"అయినా ఆంటీ, పద్మ పెళ్ళికింకా ఏడాది టైము పడుతుందన్నారు కదా.. ఈ లోపల ప్రీవియస్ రాసేస్తుంది... మరి ఫైనల్?

"అది కాదమ్మా! మనం ఆడపిల్ల గల వాళ్ళం అది మర్చిపోకూడదు. అబ్బాయి ఇష్టపడి చదివిస్తే మా ఇంటి దగ్గరుండి చదువుకుంటుంది. ఆ అబ్బాయి అమ్మానాన్నల దగ్గర లేడు కదా... వంట కష్టమయి వచ్చెయ్యమంటే తరువాతెపుడో ప్రయివేటుగా కట్టుకుంటుంది". పద్మ వాళ్ళమ్మమాటలకు సిద్ధపడినట్లు జవాబివ్వడం లేదు.

"ఈ పుట్టిన్రోజు బట్టలూ వుడ్‌బీగారి సెలక్షేనా?" లక్ష్మి వ్యంగ్యంగా అన్నదేమో పద్మ మాత్రం 'ఎలా కనిపెట్టేశావ్' అడుగుతోంది.

రేణుకకు ఈ మాటలన్నీ వినిపిస్తున్నాయి. తన పెళ్ళి పూర్వపు రోజులు గుర్తుకు వస్తున్నాయి. తనకీ, పద్మకీ తేడాలేదనిపిస్తోంది. "ఇవాల్టి నా రోజులన్నీ నీకొస్తున్నాయని అనిపించిందేమో... ఏదో ప్రమాదం జరుగుతున్నట్లుగా రేణుక దిగ్గున లేచింది. స్నేహితురాళ్ళున్న గదిలోకి

వెళ్ళాలనుకుంది. వెళ్ళలేదు. గొంతెత్తి అరచి చెప్పాలని అనుకుంది. మాటలన్నీ అంగుట్లోనే అంటుకుపోయాయి.

గడియారం ముళ్ళు ముళ్లని గుచ్చుతూనే వుంది. దాన్ని మించి రేణుక గుండె కొట్టుకుంటూ పరిగెడుతోంది.

★ ★ ★

'ఆగవే.. రేణూ.. నిన్నే... ఆగమంటుంటే ... ఇప్పుడు రాత్రి పదకొండయ్యింది. ఇంత వేళప్పుడు ఎలా వెళ్తావ్? ఏమెళ్తావ్..'' పద్మ కదలనిచ్చేలా లేదు. రేణుక గడియారం వంక చూస్తూ వున్నా, ఆమె ఆలోచనలు ఎక్కడో వున్నాయి. ఆగి నిలబడిందే కాని పిలిచిన చాలా సేపటికి పలికినట్టు 'ఊ' అంది.

''అపునే రేణూ! సుజీ, నేను కూడా వుండి పోతున్నాం. హాస్టల్‌కి సిటీ బస్ కాకపోయినా ఆటో పట్టుకొని కష్టపడి వెళ్ళిపోవచ్చు. అదికాదు, మనమంతా కలుసుకొని ముఖ్యంగా నిన్ను చూసి చాలా రోజులయింది. ఈ రాత్రి కలుసుకొని కబుర్లాడుకొని కళ్ళు ముయ్యకముందే తెల్లవారిపోతుందిగా...'' లక్ష్మి చెపుతూనే వుంది.

పద్మ వాళ్ళమ్మ గదిలోకొచ్చి 'రేణుకా.. ఇంతరాత్రి వేళా.. వద్దమ్మా రోజులు అసలే బాగో లేవు. తెల్లవారితే ఎన్ని చూడ్డం లేదు? వద్దు.. తెల్లవారి లేవడంతోనే వెళ్ళిపోదువు.. పోనీ వీళ్ళ నాన్నగారున్నా దిగబెట్టేద్దురు... ఆయన కేంపు... పెద్దదాన్ని నా మాట విను...'' చెప్పి తిరిగి ఆమె గదిలోకి వెళ్ళిపోయింది.

కొద్దిసేపు నిశ్శబ్దం... కాదు, గడియారం గంట కొట్టినట్టుగా మోగుతోంది. చూస్తుండగానే పదకొండున్నర... ఇంకెంత... పన్నెండు... అరె... అరరె...

''ప్చ్ ... పిల్లలు... అది కాదే పిల్లలు...'' రేణుక మరోమాట లేక అన్నమాటే మళ్ళీ మళ్ళీ అంటోంది.

''చూడు మాతృమూర్తీ... పిల్లలు నీకే పిల్లలు కాదు... మీ ఆయనకీ పిల్లలే... ఇంతకీ పెనిమిటి మీదా పిల్లల మీదా? ధ్యాస...?'' సుజాత నవ్వించబోయింది.

''పెనిమిటి మీద ధ్యాస ఏమోగానీ... పెనం మీద అట్టు మాడిపోతుంది. పొయ్యిలో గ్యాస్ పొయ్యి అయినా... కుట్టు ఆరిపోతోంది... పొయ్యి మీది తాళింపు వేగిపోతుంది.... ఇవే కదే కారణాలు..... అవన్నీ ఎప్పుడూ వుండేవే, రేపు పద్మా నీలాగే అయిపోతుంది. నేనూ ... ఇదీ... ఒకరూ ఒకరూ ఇలా అయిపోయి చచ్చేలోపయినా 'ఏమే' అనుకోవడానికి తీరదు. ఏమైనా నువ్వుంటున్నావ్...'' లక్ష్మి తీర్మానించేసింది.

'రేణూ.. కావాలంటే నా బర్త్‌డే వల్లే నువ్వుండిపోయావని, నేనే కారణమని... మేమంతా కారణమని మీ ఇంటికివచ్చి చెపుతాం సరేనా?!... పైగా నువ్వేదో అప్సెట్ అయి వచ్చావు. రిలీఫయి

వెళ్ళు.. మనసు విప్పి మాట్లాడుకుంటే గుండె తేలిక పడుతుంది.... పద్మ శాంతంగా అనునయిస్తూ చెప్పింది.

రేణుక ఏదో చెప్పాలని చెప్పలేక పోతోంది. ఆ కొద్ది సమయాన్ని అవకాశంగా తీసుకుని తలుపులు వేసారు. ఒకరొకరు పక్కమీద వాలారు. రేణుకని చెయ్యి పట్టి లాగారు.

టైం పన్నెండు...

"అమ్మో... అర్థరాత్రి అయింది" అనుకుని "పిల్లలు" అంది మళ్ళీ రేనుక.

"మీ ఆయన దగ్గర పిల్లలు చేరికే గదా... మీ అత్తయ్య పిల్లల్ని బానే చూసుకుంటుంది. గదా... రా ... మాట్లాడకపోతే లేదు నిద్రపో...." లక్ష్మి ట్యూబ్ లైటార్పి, బెడ్‌లైట్ వేసి వచ్చింది.

ఆ మసక వెలుతురులో చీకటినే చూస్తున్నట్లు రేణుక తెలియని భయానికి గురవుతూ 'ఆయన'... ఏదో అనబోయింది.

"ఆయన.. మీ ఆయన మాత్రం మనసు బాలేనప్పుడో.. మాటకు మాట అనుకున్నపుడో ఒక రోజన్నా ఫ్రెండ్స్ ఇళ్ళకువెళ్ళి గడపడా...." లక్ష్మి ప్రశ్నకు రేణుక సమాధానమీయలేక పోయింది.

"నువ్వు అప్సెట్‌గా వున్నావనే మేట్నీ టైమ్‌కు వచ్చినా సినిమాకి పోలేదు. సాయంత్రం వరకూ ఆగి షాపింగుకు కూడా పోకుండా నువ్వు రిలాక్సవాలని మూవీకెళ్ళొచ్చాం. అయినా నువ్వు నార్మల్ కాలేకపోతున్నావు" సుజాత అంది.

రేణుక కొద్ది సేపు ఏమీ మాట్లాడలేదు.

స్నేహితురాళ్ళ మాటలూ ఆలోచనలన్నీ చూసొచ్చిన సినిమామీదకుమళ్ళాయి. ఆ సినిమాలో కథానాయకుడు అతని భార్యపై చూపించే ప్రేమ సన్నివేశాలని గుర్తు చేసుకున్నారు. అతను రోజూ ఆఫీసు నుంచి వస్తూ పూలు తెచ్చి, ఆమె తలలో పెడతాడు. అదే విషయాన్ని ప్రస్తావిస్తూ "రేణూ మీ ఆయన తెస్తాడా"? సుజాత కుతూహలంగా అడిగింది.

'ఆ..' అందే గాని రేణుక ఇంకేమి చెప్పలేదు. అవుననో, కాదనో అర్థం కాలేదు ఆమె స్నేహితురాళ్ళకి. అయితే ప్రశ్న వెంట రేణుక నడిచింది. తొలిరోజుల్లో అతను పూలు తెస్తే సిగ్గుకో బిడియానికో - ఇన్నాళ్ళూ మేం గుర్తుకు రాలేదేం? వరసైన ఆడపడుచులు ప్రశ్నలు వేస్తారనో - అత్తగారి ముందు అదోలా వుంటోందనో - తనే పూలు తేవద్దని చెప్పడం గుర్తుకు వచ్చింది.

"కొంత మంది మగాళ్ళు ఆడిదాని కొంగూ - ఇంటి అరుగూ వదలరట..." వాళ్ళ అమ్మమ్మ చెప్పిందన్చెప్పి లక్ష్మి చెపుతోంది.

"నీకు అలాంటి ఆయనే వస్తాడ్లే..." అంది పద్మ.

"నీకు మాత్రం వద్దా ...?!" సుజాత ఆసక్తిగా అంది.

రేణుక మాట్లాడకపోయినా - వాళ్ళ ప్రశ్నల్లోకి జవాబుల్లా తన జీవితం గుర్తుకు వచ్చి, తెలియకుండా బేరీజు వేసుకోవడమో... ఆలోచనలో ... చుట్టూ తిరుగుతున్నాయి.

పెళ్ళికని పెట్టిన పది రోజుల సెలవు తప్ప... పండగ పూటయినా రెండ్రోజులు సెలవు పెట్టింది లేదు. పల్లె కాదు. ప్రవేటుద్యోగం.. సెలవులు తక్కువ. కాదు వుండవు. వున్నా.. డబల్ పే కాకపోయినా సింగిల్ పేసైనా ఇస్తారు. అంచేత జీతం మేనేజ్‌మెంట్ పెంచకపోయినా ఉన్నంతలో పెంచుకోవడానికి తప్పదు. సెలవు పెడితే బోరుకొడుతుంది. అలా అనుకుంటే ఏ అసంతృప్తి వుండదు...

మరి పొద్దున్న ఏడో గంటకు సిటీ బస్సులు పట్టుకుపోతే. అవే సిటీ బస్సులు పట్టుకు వచ్చేసరికి రాత్రి ఎనిమిది... తొమ్మిది అవుతుంది. ఓటి (ఓవర్ టైం) వుంటే పదవ్వొచ్చు... పదకొండవ్వొచ్చు... చెప్పలేం...

... వచ్చాక కడుపుకింత తిని అలసటగా చేరగిలబడి పిల్లలతో ఆడుతూనే పసిపిల్లవాడి లానే నిదురపోతాడు ప్రసాదు.

అందరి భోజనాలవనిచ్చి.. అంట్లు తోమి కడుక్కుని... పొద్దున్న కేరియర్ కోసం అప్పుడే కూరగాయలు చెక్కుకుని కోసుకొని.. అన్నీ సిద్ధం చేసుకొని.. ఆ తర్వాత స్నానమయితే ఆలస్యమని ముఖం కడుక్కొని వెళితే ఆవలింతలు తీస్తూ - కన్నారా చూసో చూడకో - మేడ మీది ఒంటి గదిలో అటీ పిల్లలు నిద్రపోతే - రెండు క్షణాల్లో చల్లారిపోయి - అత్తగారు ముందే పిల్లల్ని తీసికెళితే మంచానికి అటొకరం ఇటొకరం. లేదు పిల్లలు అల్లరి చేస్తే - వాళ్ళకటొకరం ఇటొకరం.. ఆయనకి ఒళ్ళు పీకులు... నాకు నడుం నొప్పి.. పచ్చి పుండు శరీరాలతో పీకులాడుతూనే నిద్రలోకి ...

అది నిద్రో.. అలసటో తీరకుండానే తెల్లవారకుండానే ఇల్లూ వాకిలీ వూడ్చడాలు.. కల్లాపు నీలు జల్లుకోవడం లేదూ ఇల్లు పిడి పెట్టుకోవడం వంటా వార్పు.. గడియారం ముళ్ళయినా బేటరీ అయి ఆగిపోతుంది... ముళ్ళులా ఒకేలా గుండ్రంగా తిరుగుతూ తిరిగిందే తిరుగుతూ...

"మీ అత్తగారు మంచి వాళ్ళేనా ...?" లక్ష్మో సుజాతో పద్మో ఎవరడిగిందీ తెలియలేదు. ఆలోచనల నుంచి ఇవతల పడి మాటొక్కటే వినపడింది. రేణుక చెప్పింది. 'మా అత్త మంచిదాయే, కాకపోతే ఆవిడలా నేనుండలేను.."

స్నేహితురాళ్ళేదో అడగబోయారు.

ఫోన్ మోగింది.

పద్మ లేచి వెళ్ళి రిసీవర్ తీసింది.

లక్ష్మి లైటు వేసింది. "ఎవర్నుంచే ఇంత వేళప్పుడు?" సుజాత అనుమానంగా పద్మ వెనకాలే నిలబడింది.

ఎందుకో రేణుక గుండె కొట్టుకుంది.

"ఎవరూ.. ప్రసాద్ చిన్న తమ్ముడా మురళీనా..." పద్మ అంటూ ఆగిచూసింది రేణుక వైపు. రేణుక లేచి కూర్చుంది. పొద్దుటి నుండి కాలుతున్న సెగంతా మళ్ళీ ఎగతోసినట్టయింది. గుండె కొట్టుకున్నట్టో, ఆగిపోయినట్టో తన పరిస్థితి తనకేమి అర్థం కాలేదు. ఆలోచించడానికి వ్యవధి లేదు, మరో ఆలోచనా లేదు.

పద్మ ఫోన్ రిసీవర్‌లోని మౌత్‌పీస్‌ని అరచేత్తో గట్టిగా మూసి 'చెప్పు' అన్నట్టుగా రేణుక వైపు చూసింది.

"లేను... లేనని చెప్పేయ్.. రాలేదని చెప్పేయ్.." రేణుక గొంతు వణికింది. కుప్పకూలిపోయినట్టు నిల్చున్న చోటే కూర్చుండిపోయింది.

"లేదండీ.. రేణుకా రాలేదే .. వస్తే మీరు చెప్పిన నెంబరుకి ఫోన్ చేసి చెపుతాలెండి. అలాగలాగేనండి.... తప్పకుండా... మంచిది...." పద్మ ఫోన్ పెట్టేసింది.

అంతా నిశ్శబ్దం.

రేణుక చూసే చూపు వింతగానూ భయం గొల్పేలానూ తోచింది. లక్ష్మి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి రేణుకకి అందించింది. "ఏం జరిగింద"ని పద్మనడిగారు లక్ష్మి, సుజాత.

"చెప్పి రాలేదా నువ్వు" అని రేణుక వంక చూసి ఆగి "నువ్వెటు వెళ్ళిపోయావోనని వెతుకుతున్నారట. కంగారపడుతున్నారు. మీ అమ్మా వాళ్ళ ఊర్లోనే కదా, వచ్చారట. అంతా కలిసి ఏదో గొడవవుతున్నట్టే వుంది. మీ మరిదేం చెప్పలేదు.." అంది పద్మ.

రేణుక తిరిగి ఇంటికి వెళ్ళడానికి భయపడింది. వెళ్ళాలని అనిపించింది. వెళ్తే మాట నిలుపుకోలేని తనమవుతుంది... వీల్లేదు.. వెళ్ళకూడదు.. మొండిగా అనుకుంది. వెళ్తే అదీ ఈ వేళప్పుడు గొడవ ఎంతకయినా పోతుంది... తెల్లారనీ... చల్లారనీ....

"....ఇదిగో రేణుకమ్మా సెప్పలేదనుకుండేవు.. ఇను.. ఏనికి సెప్పతన్నానో నామాటొక రవ్వ సెవ్వాలించి ఇను. పదీ దపాలు సెప్పి నా నోరు పీకిపొడమేగాని నీ బుర్రకేమి ఎక్కడం లేదు. "నీకు పెళ్ళయింది" మర్సిపోకు. ఇంకా పెళ్ళికాని పిల్లలా సినిమాలూ సికార్లంటే కుదరదు. గుట్టుగా సంసారం సేసుకుపోడం మానీసి పోకిరీ తిరుగుళ్ళు మంచివి కావు..."

"ఒక సినిమాకో, ఫ్రెండు ఇంటికో వెళ్తే పోకిరి తిరుగుళ్ళా? అలా వెళ్ళినంత మాత్రాన సంసారిని కాకుండయిపోతానా? మీ ఉద్దేశమేమిటో సూటిగా చెప్పరాదూ? కోడలరకం మాని సానరకం చేస్తున్నాని అనరాదూ?!"

"నీనడం కాదోలమ్మీ.. రేణుకా.. అలాగని లోకం అంతాది. లోకులు పలు గాకులు. నాలిక్కి నరం లేదు. ఏదైనా అంతారు..."

"నాకు నచ్చవు... నేను పడను..."

"మనకి నచ్చినా, నచ్చకపోయినా పడక తప్పదు. మన నడవడికని బట్టి అంతారా అని తీరుతారా?!..."

"ఎవరో తీరుతారో లేదో గాని, మీరు తిడుతున్నారు"

".. ఇదేమి ఇద్దూరమమ్మా.. ఇలక్కాదిలాగ.. అలక్కాదిలాగ అంతె సరే.. తప్పేనా? తిట్టేనా. దీవినేనే? పెతీది తిట్టనుకుంతె ఎలాగ? వున్న మాటంతే వులుకుతావు గాని నీకు మా సెద్ద సింగు. ఓర్పు ఆడకూతురికి వుండాల.. అది నీకు లేదు గాక లేదు.. వారిస్తే కోడిగుడ్డు సట్టిడు. అయిదు రెండాడీ గాన గొప్పకాదు.... అందులోనూ పెళ్ళయినదానివి.. ఇద్దరు పిల్లల తల్లివి..."

"అవును.. పాతికేళ్ళకే ముద్దముసలి దాన్ని... పండు ముసలిదాన్ని..."

"లేదు... లేదు...సిన్న సొన్నవు... ఎటు పడితే అటు తిరుగుదువు గాని... ఆడిబయ్య మొకటి నీకు లేదు. లచ్చిం లేదు..... వుంతె నువ్విలాగ సెయ్యవూ... సెందవూ.."

"ఏమిటి చేస్నాను? ఎవర్ని నరికీసానా? కొరికీసానా?"

"... సేసింది సేస్సి అడగడానికి సిగ్గు లేదూ?! మనిసి పుట్టగ పుట్టలేదూ? మా కాలంలా లేదమ్మ ఇలాటి సింగారం... ఇల్లూ పిల్లలు ఇదే లోకం తప్పితే. ఈదుల్లంట తిరుగుదుమని యూవుండేదే కాదు. మగోడెప్పుడో తీసికెళ్తే దిక్కు. లేపోతే అదీ లేదు. నాలాటి దాన్ను పెళ్ళయి సినిమాలే మర్సిపోన్ను. అదవా రమ్మన్నా. బండెడు సేకిరి. ఈ సేకిరంత తెమిల్చేసరికి బలముండీదే కాదు. అటు దీప్తి వుండీదే కాదు.... నానూ ఈముండ పట్నమొచ్చి పదేళ్ళయింది...."

"కుందకు కట్టిన పశువులాగ ఇంట్లోనే పడివుండాలా? ఓ సరదా... సందడీ వద్దా? మనుషులం కామూ? అయినా నా వల్ల కాదు... కాదు గాక కాదు.."

.... వల్ల కాదంతే సెల్లదు... ఇది నా ఇల్లు. లోకంలోని రివాజులాగే ఈ యిల్లూ వుంతాది. ఈ యింట్లో మనుసులూ వుండాల.'

'......................'

'......................'

' నే వెళ్తున్నా ..'

'ఇన్ని సెప్పినా నీ మాట నీదేనా?'

'......................'

'నా మాట కాదనేసి అరుగుదాటేవో.. ఇంక ఈ గుమ్మంలో అడుగెట్టకు. మనిషవయితే మరింకెప్పుడూ ఈ గుమ్మం మొకమూ ఈ యింటి మొకమూ సూడకు. తెల్సిందే ... తెలిస్తే ఎళ్ళు....'

'......టైమయిపోతోంది...'

'ఎప్పటిలాగే అయిపోతోంది. అట్నుంచి వచ్చి నీ మాట వింటా...'

'రేపు శెనోరం, ఇల్లూ గుమ్మాలు కడగలేదు. తిర్నాద మూర్తుల రతమనుకున్నాం. ఇల్లూ గుమ్మాలూ ఎలాగున్నాయో సూడు.. అదా అంట్లు.. పిల్లల బట్టలవటం లేదు.... ఎండా కాలం పిల్లలకి నీల్లు పొయ్యలేదు. మరిడితిన, నీలూ రాలేదు. సరి సాయంత్రానికి మొగ మనుషులొత్తారు. అన్నీ అమర్నాల.. అందరత్తల్లాంటిదాన్ని కాను.. నా సేతనయికాడికి సేత్తనే వున్నాను. ముద్ది మోపడం ఎరగను.. పొద్దున్న లేసిన దగ్గిర్నించి రేతిరిదాక రాట్నం తిరిగినట్టు తిరగతన్నాను... ఎందరు సేసినా ఈ ముష్టి ఇంట్లో పనులు తెమలవు...'

'... తెమలవు తెలుసును కదా? నేను ఎన్నాళయిన ఇల్లు కదిలానా? లేదే? ఈ రోజు నా ఫ్రెండ్ బర్త్‌డే అనే కాదు. దాని పెళ్ళి కుదిరింది. ఊర్లో వుండే బొట్టు పెట్టిన రోజూ వెళ్ళలేకపోయాను. మిగతా ఫ్రెండ్సూ వచ్చారు. మళ్ళీ కలవరు... నే వెళ్ళాలి... వెళ్తున్నా...'

'ఎళ్లు .... ఎళ్లు.. నీ మాట నీదే కదా. ఎళ్ళు ... ఎళ్లి మళ్లీ ఈ గుమ్మం తొక్కకు. అరుగెక్కకు సెప్పినాను కదా. తిరిగొస్తే నానొప్పను.. ఒప్పుకోను... పో... మళ్ళీ రాకు. ప్రసాదు రానీ... ఈ ఇంట్ల నువ్వో నేనో వుండాల. వున్నోల మాట జరగాల. అయినా ఆడపిల్లవి. పెళ్ళయినదానివి... ఛీ... ఛీ... నిన్ను కన్నోల్ని అనాల. పెంచినోల్ని అనాల.. నిన్నని లాబం లేదు... ఇదిగో రేణుకా ఎల్తన్నావు.. ఎల్తే మటుకు తిరిగి రాకు. నీకు సేతులెత్తి మొక్కుతాను....'

కమలమ్మ కోపంతో ఎత్తిన చేతులు నెత్తిమీంచి దించి వెళ్తున్న రేణుకకేసి చూస్తూ మొక్కుతూనే వుంది. వెనక్కి తిరిగి ఆగి, వెనక్కి వచ్చి టేబుల్ మీద వున్న పేపరు తీసి ప్రసాదుకి ఉత్తరం రాసి అక్కడే పడేసి - ఆడుకుంటూ వచ్చిన పిల్లాడి అరుపు చెవిని చేరకముందే - పరుగులాంటి నడకతో ఇంట్లోంచి బయటపడింది.

★ ★ ★

"రేణుకేదమ్మా ..." ఏ వందో సారో తల్లిని అడిగాడు ప్రసాదు. వీధి అరుగు మీద గొంతి కూర్చున్న కమలమ్మ పైటచెంగు లుమ్మ చుట్టుకుని నోటికి అడ్డం పెట్టుకుంది. ఆమెకు ఏం జరుగుతుందో బోధపడనట్టే వుంది. కొడుకు అడిగిందే అడుగుతున్నా చెవిటిదాన్లా అంతకన్నా మూగదాన్లా వూరుకుండిపోయింది.

అప్పటికే ఇరుగూ పొరుగూ జనం ఇంటి ముందు చేరారు. ఎవరెవరో కుర్రాళ్లు స్కూటర్లు తీసి వెళ్ళి వస్తున్నారు. అటూ యిటూ తిరుగుతున్నారు.

ఆ అర్థరాత్రి సమయం వీధి వీధంతా పట్టపగల్లా వుంది. ఇంటాబయటా లైట్లన్నీ వెలిగివున్నాయి. పెద్దవాళ్ళెవరూ నిద్రపోవక పోవడంవల్ల పిల్లలు ఆటలాడుకుంటున్నారు. మరీ చిన్న పిల్లలు నిద్రకు అల్లరి చేస్తున్నారు. ప్రసాదు పిల్లలిద్దరూ గొడవంతా అర్థమైనట్లు బిక్కచచ్చిపోయున్నారు. పెద్దపిల్లయితే తల్లికనబడక ఏడ్చి ఏడ్చి వూరుకుంది. చిన్నకొడుకు మాత్రం

ప్రసాదు మెడ చుట్టి పట్టుకు వేళాడి వున్నాడు. దిగమన్నా దిగడంలేదు.

"అమ్మా.. రేణుకేదమ్మా.. అమ్మా.. నిన్నే... టైము రాత్రి ఒంటిగంటవుతోంది. ఇంకా ఇల్లు చేరనేలేదు... ఏమయిందమ్మా..." ప్రసాదుకు భయంగా వుండి, తట్టుకోలేక మళ్ళీ అడిగాడు.

"... నన్నేటి అడుగుతావురా? నాకేటి సెప్పీసెళ్ళిందిరా.. వద్దమ్మా అనీసి సెప్పినాను. సెతపోరు సేసినాను, ఇన్లేదు... ఇంతే ఈ అవస్తెందుకు? ఇంతల్లరెందుకు? ..." కమలమ్మకు కోడలి మీద కోపం వున్నా, లోలోపల భయం బయల్దేరినట్టు వుంది. అందుకే ఆమె గొంతు వణికింది.

ప్రసాదు నిలుచున్న చోట నిలవలేకపోతున్నాడు. అరుగు దిగి వీధిలో కెళ్ళాడు. వీధిలోంచి మళ్ళీ ఇంట్లోకి వచ్చాడు. ఫేను గాలికి టేబులు మీది రేణుక రాసి విడిచిపెట్టిన ఉత్తరం రెపరెపలాడుతోంది. ప్రసాదు అప్పటికి ఏ పదో సారో ఆ ఉత్తరాన్ని చదివినా, మళ్ళీ చదివాడు.

"ఏమండీ!

ఈ రోజూ మామూలే. రోజూ వున్న గొడవే అయినా రోజురోజుకీ నేను తట్టుకోలేక పోతున్నాను. ఇవాళ మరీనూ. గొడవకి కారణాలు మీకక్కరలేదు. మీ అమ్మని తప్పు పట్టరు. నన్నే సర్దుకుపోమంటారు. నా బాధలు మీకు చెప్పినా, ఇవన్నీ తప్పవంటారు. తప్పుకుంటారు. అవన్నీ ఇప్పుడెందుకు గానీ.... నేను వెళ్తున్నాను. నే వెళ్ళినపుడే మీ అమ్మ చెప్పింది తిరిగి అరుగెక్కొద్దని, గుమ్మం తొక్కద్దని, ఆవిడే హక్కుదారి చెప్పగలదు. ఇన్నాళ్ళూ ఆవిడ మాట వినలేదని పోరేది. ఇవాళ వింటున్నాను. అంచేత మరి గొడవలుండవు. మీరు ప్రశాంతంగా వుండొచ్చు. నే వెళ్తున్నా. ఆవిడో, నేనో ఈ ఇంట్లో వుండాలట, నేను మధ్యలో వచ్చినదాన్ని... మధ్యలోనే పోతున్నాను. పిల్లలు జాగ్రత్త. శలవు.

- ఇట్లు

రేణుక

చదివినప్పుడల్లా ప్రసాదుకు ఒక్కో అనుమానం కలుగుతోంది. అతని గుండె మరింత వేగంగా కొట్టుకుంది. అనుమానపు పొగలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఏదో భయం వెన్నుని విరిచి వంట్లో వణుకు పుట్టిస్తోంది.

..."నా కూతురేమయ్యింది... నా రేణుక తల్లేమయ్యింది..... అమ్మా రేణుకా..." అరుపులతో రేణుక తల్లీ, ఆమె వెంటే తండ్రీ వచ్చారు. వచ్చిన వాళ్ళ చుట్టూ మరింతమంది జనం మూగారు.

"నలుగురు ఆడపిల్లల్ని కన్నాము. నలుగురికీ మనువులు చేసినాము. ఆఖరిపిల్ల ఊర్లో ఇస్తే కళ్ళ ముందు తిరుగుతుంటాదని కల గన్నాము. ఇంతా చేసి మేకపోతుని అమ్మోరికి బలియిచ్చినట్టు వయిసిన కూతుర్ని ఈ ఇంటికి బలిచ్చీసినాం.." రేణుక వాళ్ళమ్మ ఏడుస్తూ వుంది. అంతకంటే అరుగు మీద కూర్చొని వున్న కమలమ్మ కేసి చెయ్యి చూపిస్తూ "ఆడపిల్ల ఒక ఇంటినుండి మరక ఇంటికెందుకొస్తాది? నీకు కూతుర్లు లేరు, వుంటే తెలిసున్ను. ఈజన్మకు కాకపోయినా

మరు జన్మకి అనుభవమైపోదా... మా వుసురు... నా కూతురుసురు వట్టిన పోదు.. వల్లకాడైపోదా నీ యిల్లు..." తిడుతోంది.

కమలమ్మ కదలక మెదలక అలానే కూర్చుంది.

ప్రసాద్ ఆ మాటలు విని, వచ్చింది అత్తమామలని గ్రహించాడు. దాంతో ఆయన భయం రెట్టింపయింది... రేణుక అక్కడా లేదన్నమాట.

"నా కూతురు తప్పు చేస్తే - నీ కొడుకొస్తే చెప్పి గుండగ తన్నించుందువు. కొట్టించుందువు. అది ఎవులికీ బాధ కాదు. గుమ్మం ఎక్కొద్దని తాటించడమేటి.... ముసిల్దానవు.. రేపో మాపో చావాల్సినదానవు. కోడలు పోతే వుట్టి కట్టుకు వుయ్యాలూగుదుమనా...?!"

తిట్లు సాగుతూనే వున్నాయి.

"ఆడదాన్ని ఇంటినుంచి ఎంటబెట్టేసి ఆడదానిలా ఇంటిలోన కూచున్నావా... రా బయటికి... ఒరే ప్రసాదూ నిన్నే...." మామ లుంగీ బిగించి అరుస్తున్నాడు.

ప్రసాదు ఉలిక్కిపడి, మెడను పట్టి వేలాడే పిల్లాడ్ని భుజం పైకి మార్చుకొని ఇంట్లోంచి వీధిలోకి వచ్చాడు.

"... ఇదిగో ప్రసాదూ.. నా కూతుర్ని మాయంజేస్సి మీయమ్మతో కలిసి నాటకమాడుతున్నావు. నీకిది ధర్మం కాదు. రేణుక ఎక్కడుందో చెప్పు... ఏం చేసావో చెప్పు...." ప్రసాదుని గద్దించాడు అతని మామ. అతని గొంతు గద్దించినా కళ్ళు బతిమాలాడుతున్నాయి.

ప్రసాదు గుటకలు మింగాడు. అయోమయంగా చూసాడు. ఆ తర్వాత సమాధానం వెతుకుతున్నట్టు తల్లి వంక చూసాడు. కమలమ్మ కళ్ళలో ఆ చూపు గుచ్చుకుంది. కొడుకు నోట్లో నాలుక లేదని తనే మాట్లాడింది. గొంతు విప్పింది.

"ఏట్రయ్యా... ఏటమ్మా... కోడల్ని అత్తదాయొక మాటనదా? ఆడదా? అలాగనీసి ఇల్లొదిలి ఎలిపోవడమే.. అది మీకు పిల్లేమో గాని.. అది పిల్లల తల్లీ కాదు.. ఈ ఇంటికి పట్టిన పిశాచి..."

"నీ ఉక్రోషం చూస్తుంటే నువ్వే ఏదో చెయ్యించావని తెలుస్తోంది. మా కూతురుకేం కాని మేమింత విషం మింగీసి చస్తాం...." రేణుక తల్లి నలుగురికీ వినబడేలా అరుస్తోంది. దానికి తోడు అపరాత్రి కావడం ఊరంతా విన్పిస్తున్నట్టే వుంది.

స్కూటరు మీద రంయ్‌మని వచ్చి ఆగిన కుర్రాడు ముందు వెనకా చూడకుండా "ఇంచుమించు అన్ని సినిమా హాల్లూ చూసాం. సెకండ్ షో కూడా వదిలేశారు. అన్ని బస్టాపులూ వెదికాం...లేదు.. కనిపించలేదు.." చెప్పాడు.

అంతలోనే మరో స్కూటరొచ్చింది, ఆపకుండానే "రేణుక ఫస్టు షో సినిమా చూస్సి ఇంటికే వచ్చీసిందట..." చెప్పాడతడు.

అందరూ అయోమయంగానూ అంతకన్నా ఆందోళనగానూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

ఒకే ఒక్క క్షణం నిశ్శబ్దం...

"వదినా వాళ్ళ ఫ్రెండ్స్ ఇళ్లన్నీ చూసాను. పద్మ.. అదే వదినా వాళ్ళ ఫ్రెండు వాళ్ళింటికి ఫోన్ చేశాను. వదిన లేదు.. రాలేదట.." మురళి ఆయాసం వల్ల వగరుస్తూ చెప్పాడు.

"పద్మాయే చెప్పిందా..." ప్రసాదు ఆఖరి ఆశ తీరక మళ్ళీ అడిగాడు.

"పద్మే చెప్పింది. నేనే పద్మతో మాట్లాడాను" ఖచ్చితంగా చెప్పాడు మురళి.

అన్ని ఆశలూ కూలిపోయినట్టు ఒక్కసారి ప్రసాదు 'అమ్మా' అంటూ బోరుమని ఏడుస్తూ కుప్పకూలిపోయాడు. అతని పిల్లలిద్దరూ తండ్రిని చూసి ఏడుపందుకున్నారు. మురళి వారిస్తున్నాడు. మరెవరెవరో వారిస్తున్నారు.

"పోలీసు కంప్లైంట్ ఇద్దాం పదండి..." ఎవరో రేణుక తండ్రిని తీసుకొని బయల్దేరారు. రేణుక తల్లి ఏడుస్తూ తిడుతోంది.

కమలమ్మ నేరస్తురాలిలా తలదించుకునే వుంది.

ఇరుగు పొరుగులో కొంతమంది ఆ రాత్రి వేళప్పుడు టార్చిలైట్లు, నూతి పిల్లులు, తాడు పట్టుకొని బయల్దేరారు. కాలనీ చివర వుండే వాటర్ టాంకు ఎక్కి చూశారు. ఇంకా పాడుబడ్డ నూతులూ అన్నీ నూతిపిల్లి వేసి తీసారు. చెత్త తప్ప వాళ్ళ అనుమానపు శవమేమి దొరకలేదు.

పోలీసులొచ్చారు. వివరాలన్నీ అడిగి తెలుసుకున్నారు. ఎంక్వయిరీ చేస్తామని చెప్పి - గొడవలేవీ జరక్కుండా ఎటు వాళ్ళనటు పొమ్మన్నారు. అయిష్టంగానే ఎవరిళ్ళకు వాళ్ళు కదిలారు. నూతులూ గోతులూ వెతికొచ్చిన తడిబట్టలవాళ్ళనీ వెళ్ళిపొమ్మన్నారు. తాము చూస్తామన్నారు. డీల్ చేస్తామన్నారు. తెల్లవారనీ అన్నారు. ఇప్పటికిప్పుడు చేయగలిగిందేమీ లేదన్చెప్పి రేణుక తల్లిదండ్రుల్ని వారి ఇంటికి పంపేశారు. కేసేదో రాసుకుని జీపులో వెళ్ళిపోయారు.

ఆ రాత్రి పట్టపగలు పోయి మళ్ళీ రాత్రయింది.

వేకువకు మరో ఝాము గడవాల్సి వుంది.

ఒక్కో లైటు ఆరిపోయింది. వీధిదీపాలు తామెందుకన్నట్టు వెలిగీ ఆరీ చివరకు ఆరిపోయాయి. చీకటి పరుచుకుంది.

ఆ చీకట్లో అలాగే కూర్చుంది కమలమ్మ.

ప్రసాదు పిల్లల్ని నిదురపుచ్చాడు. అంతకు మునుపు వాళ్ళ అమ్మని గురించి అడిగితే వస్తుందనే చెప్పాడు. పిల్లలకి నమ్మకం కలిగించినా, తనా నమ్మకాన్ని పొందలేక పోయాడు. కోటి... అనంతకోటి అనుమానాలు.... అంచులు దొరకని ఆలోచనలు.

రోజూ పేపర్లో చూసే వార్తలు.. సిటీ ఎడిషన్ మూడో పేజీ వార్తలన్నీ కళ్ళముందు కదిలాయి. ఆ వేళప్పుడు అవి ఒకటొకటి కళ్ళముందు జరుగుతున్నట్టే వుంది.... భయంతో పిల్లల్ని దగ్గరగా లాక్కున్నాడు. కౌగిళ్ళోకి రేణుక వచ్చినట్లయింది.

కాని రేణుక ఉరిపోసుకుందో పురుగుల మందే తాగిందో నాలిక ఎరుపెంతో చూడమన్నట్టు బయటకు తీసి చూపిస్తోంది.

పేపర్లో వార్త(లు). వార్తల్లోని పాత్ర ... రేణుకయినట్టు తోచింది.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు ప్రసాదు.

పిల్లలు నిద్ర పోతున్నారు. పక్కనే మురళి కూడా.

ఆప్యాయతని మించిన దుఃఖంతో పిల్లల్ని చప్పుడు లేకుండా ముద్దాడి, నెమ్మదిగా లేచి మేడమీది ఒంటి గదిలోకి చేరాడు. తలుపులు వేసుకున్నాడు. అంతవరకూ వినిపించిన వీధి కుక్కల అరుపులు... గూర్ఖా విజిల్ ఆగిపోయాయి. గదంతా ఫేన్‌గాలి ఒక్కటే తిరుగాడుతోంది.

కళ్ళు మూసుకొని మోకాల్లో తల నిడుకుని కూర్చున్నాడు. పోలీసుల్లో అత్తమామలో, ఇరుగు పొరుగో ఇంకెవరో వచ్చి తలుపు తట్టినట్లు అనిపించింది. తలుపు తీస్తే ఎవ్వరూ లేరు. రేణుకా లేదు. గదిలో కొచ్చి గడియ పెట్టుకున్నాడు. గది జైల్లా అనిపించింది. 'రేపట్నుంచి అదేగా గతి' అనుకోకుండా ఉండలేకపోయాడు.

గోడల మీది రేణుక ఫోటోల్ని చూసాడు.

రైలు కమ్మీల కింద తలపెట్టిన రేణుక, పురుగుల మందు తాగి నురగలు కక్కుకున్న రేణుక, నూతిలో దూకి తెప్పతేలిన రేణుక..

ఒక్కో పోటో ఒక్కోలా అగుపించింది.

'అరళ్ళు పెట్టినందుకు.. రేణుకని లేకుండా చేసినందుకు జైలు శిక్ష కాదు ఉరిశిక్ష వెయ్యాలి' ' రేణుక ఇంటిల్లి పాదీ అరుస్తున్నట్టనిపించింది.

రేపటిని ఊహించలేక, ఆ సాహసం లేక 'అసమర్థుడి' ని అనుకున్నాడు. అలా అనుకున్నాక బతికి సాధించేది లేదని అనిపించింది. అలా అనిపించాక ' నా చావుకు ఎవరూ కారకులు కారు' అన్చెప్పి ఉత్తరం రాసాడు.

ఆ తర్వాత ఆగి వున్న ఫేనుకు ఉయ్యాల్లా తాడు వేళాడి వుంది. ఆ తాడు ప్రసాదు మెడని చర్మంతో కలిసిపోయినట్టు చుట్టేసి వుంది. ఫేను రెక్కలే కాదు, అతగాని కాళ్ళు చేతులు కూడా కదల్లేదు.

ఆ వేకువా - అతని బతుకూ తెల్లవారింది!

★ ★ ★

ప్రసాదు నవ్వుతున్నాడు...

ఆ నవ్వుతూ ఉన్న ఫోటోను తీసి ఏడుస్తూ ముద్దులాడింది కమలమ్మ. తర్వాత ఆ ఫోటోని తీసి బట్టలు సర్దిన పెట్టెలో పెట్టింది.

రేణుక కడుపు పూనితే బాత్‌రూమ్‌లోకి వెళ్ళి వచ్చింది. గదిలో ఫోటో లేదు. ఫోటోను పట్టుకున్న కమలమ్మా లేదు.

"అమ్మా మైకు సెట్టులు ఇప్పేస్తున్నారే.." మేడమీది గదిలోకొచ్చిన కూతురు. రేణుక ఏమీ అనలేదు. ఆ పిల్లే మళ్ళీ అంది.

"కుర్చీలు బెంచీలు అన్నీ తీసికెలిపోతున్నారు... అమ్మా ... మరి రాత్రికి వుంచరే?!"

తల్లి ముఖం చూసి కొంచెం ఆగి మళ్ళీ పిల్లే అంది. "అమ్మా.. అందరూ వెళ్ళి పోతున్నారే. పిన్ని, మామయ్య, శ్రావణి అంకుల్ వాళ్ళు, మన తాతయ్యా, అమ్మమ్మా కూడా...."

రేణుక విస్తుపోవడం లేదు. ఏదో కొత్త వాళ్ళని పరిచయం చేస్తే విన్నట్టుగా వింది. "అమ్మా కిందింటికెళ్దాం రాయే" ఆ పిల్ల తల్లి చెంగు పట్టి లాగింది. కొత్తగా అడుగులు వేస్తున్నట్టు మెట్లు దిగి ఇంట్లోకి వెళ్ళింది రేణుక. అప్పటికే వచ్చిన బంధుజనమంతా వెళ్ళి పోయినట్టున్నారు. ఉన్న కొద్దిమందీ వెళ్తూ రేణుక ముఖం చూసి చెప్పక తప్పదన్నట్టు వెళ్తున్నామని చెప్పినా - అది రేణుక కన్నా ఆ ఇంటి ద్వారాలకో, తలుపులకో చెపుతున్నట్టే వుంది.

అప్పటికే చీకటి కావస్తోంది.

పురమెత్తిన వాళ్ళంతా శ్మశానికెళ్ళి ప్రసాదుని బూడిద చేసిన చోట ప్రసాదాలుంచి వచ్చారు.

"కొడుకు పోయిన పద్దకుండు రోజులూ పద్దకుండు వంటలు సేసి రోజూ పెట్టినాను. ఇకన ఆ భగవంతుడే వున్నాడు.. రాయన్రా తిందురు..." అని పురమెత్తిన వాళ్ళకి ఆకులు వేసి భోజనాలు పెట్టింది కమలమ్మ. వాళ్ళు అయిష్టంగా తింటున్నారని గమనించిందేమో... "అయ్యా తుత్తిగా కడుపునిండా మీరు తింతే అక్కడ నా కొడుకు కడుపు నిండుతాది" అంటోంది దుఃఖంతో నిండిన కళ్ళు నీరై కారకముందే కొంగుతో ఒత్తుకుంటోంది.

"ముఖం చూసి, గుమ్మం మట్టించడానికి" అని చెప్పి, బాగా తెలిసిన కుటుంబాలు వాళ్ళు రేణుకని తీసుకెళ్ళి తెచ్చి దిగబెట్టారు.

"మనమూ ఇవాళే మట్టించిద్దుమా, మళ్ళీ మంచి రోజంటే ఎప్పటికో?...." అంది రేణుక తల్లి. 'అలాగే' నన్నట్టు తలూపాడు ఆమె పెనిమిటి.

'దూరాబారం కాదు... ఊర్లోనే గదా ఎంచేపు తీసుకెళ్ళి గుమ్మం మట్టించెయ్యండి" అంది కమలమ్మ ఈరకత్తె తానూ ఊరు బయల్దేరుతూ.

అప్పటికప్పుడు ఆటోలో రేణుకని తమ ఇంటికి తీసుకు వెళ్ళి 'ముఖం చూసి గుమ్మాలు మట్టించి, చేతిలో చీరొకటి పెట్టి మళ్ళీ తెచ్చి మెట్టినింట దించేసారు. రేణుకతో మాట్లాడడానికి అది సమయం కాదన్నట్టే వ్యవహరించారు. ఎవరో తరుముతున్నట్టే ఉరుకుల పరుగులతో పనిని కానిచ్చారు - రేణుక తల్లిదండ్రులు..

రేణుక ఇల్లు చేరేసరికే పిల్లలిద్దర్నీ ముస్తాబు చేసి తనూ బయల్దేరి వున్న కమలమ్మను రేణుకే కాదు, రేణుక తల్లిదండ్రులూ గమనించలేదు.

"వొదినా... మన చేతిల ఏటి లేదు.. భగవంతుడు దాన్నుదిటన అలాగ రాసాడు. పూర్వజన్మల ఏ పాపం చేసిందో చిన్న చూపు చూసాడు. ఏది ఏమయినా పెళ్ళి కాకముందు మా పిల్ల. పెళ్ళయినాక మీ కోడలు. మేం రేణుకని మాతో తీసుకెళ్తే లోకం రివాజుని కాదనీసినట్టే. దానిల్లు ఇది. ఇక్కడే వుండనీ... కష్టంకీ సుఖంకీ మా ఇంటికి వచ్చీ పోతుండనీ...." రేణుక తల్లి గొంతు బొంగురుపోయింది. దుఃఖం నిండిన కళ్ళని తుడుచుకుని 'వస్తాం' అని బయల్దేరింది.

"వెళ్తామమ్మా" రేణుక తండ్రి అని, నడుస్తున్న భార్యని అనుసరించాడు.

చూస్తుండగనే కనుమరుగయారు.

చాలాసేపు నిశ్శబ్దం తరువాత పెద్ద ఊపిరి తీసి "నీ యిష్టం.. నీ యిష్టమొచ్చిన రీతిగా బతుకమ్మా రేణుకా... నిన్ను ఆపను. నువ్వు నన్నాపకు... నా మనుమల్ని ఆపకు... నా మనవల్ని నాతోటి తీసుకపోతన్నాను... రండ్రా ..." కమలమ్మ అనేసి మనవల్ని తీసుకొని - ఇల్లు దాటి, అరుగు దిగి వీధిలోకొచ్చింది.

రేణుక ఆగలేకపోయి, కూలబడ్డచోటు నుండీ లేచి పరుగులెత్తింది. గుమ్మం దిగిందో లేదో ... పది రోజులుగా పట్టెడన్నం తినలేదేమో కళ్ళు తిరిగి పడిపోయింది. వెనక్కి చూస్తూ ముందుకు నడుస్తున్న పిల్లలు నాయనమ్మ చెయ్యి విదిలించుకుని 'అమ్మా' అని అరుస్తూ తల్లిని చేరారు. కమలమ్మా వెనక్కి తిరిగి పరుగున వెళ్ళి ఇంట్లోంచి మంచినీళ్ళు తెచ్చి కోడలు ముఖం మీద చల్లింది.

★ ★ ★

*ప్రచురణ : 02 ఏప్రిల్ '99 'మాభూమి' సమగ్ర సాంఘిక రాజకీయ సంస్కృతిక వేదిక.*

***రచనా కాలం : ఫిబ్రవరి ఆఖరి వారం, 1999***